www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 16 | జూలై | 2026
పేజీలు : 8

## సర్ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలి



8 లో

- అర్హులైన ప్రతి ఓటరుకు తుది జాబితాలో స్థానం కల్పించాలి
- వందశాతం డిజిటలైజేషన్ చేపట్టాలి
- మ్యాపింగ్ కానీ ఓటర్లకు నోటీసులు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



- పాల్వంచను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తా
- రూ. 1.73 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎంఎల్ఏ కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** అన్ని రంగాలలో సమగ్రాభివృది చేసి ఆదర్శ పాల్వంచగా తీర్చి దిద్దుతానని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు.కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ పట్టణం 31వ, డివిజన్ బృందావన కాలనీ,33వ, డివిజన్ శేఖరం బంజెర, సోనియా నగర్, పిచ్చయ్య బంజెర, 45వ, డివిజన్ గోవర్ధనగిరి కాలని, ఒడ్డుగూడెం, 38వ, డివిజన్ గట్టాయిగూడెం, 34వ, డివిజన్ కరకవాగు తదితర డివిజన్ లలో రూ. 1. 73 కోట్లతో చేపట్టే రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు బుదవారం శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ద్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు

మిగతా 2లో..



## చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు

- ఈ ఏడాదికి ఇంకా మొదలుకాని తతంగం
- మత్స్యకారుల ఆశలపై ఎల్‌నినో ఎఫెక్ట్
- ఆందోళనలో మత్స్యకార సంఘాలు
- నగదు బదిలీ చేస్తే అక్రమాలకు చెక్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మత్స్యకారుల ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా ఉచితంగా చేప పిల్లల పంపిణీని చేస్తోంది. గత ఏడాది లక్ష్యంలో కాస్తంత వెనుకబడ్డా ఈ సారి ఇప్పటి వరకు ఎలాంటి కార్యచరణ రూపొందిచక పోవడంతో నీలినీడలు అలుముకున్నాయి. దీంతో మత్సకార సంఘా లు ఆందోళన చెందుతున్నాయి. జిల్లా వ్యాప్తం గా 81 మత్స్యకార సంఘాలున్నాయి. వీటిలో 13 ప్రాథమిక మత్స్యకారసంఘాలు ఉండగా, 63 గిరిజన మత్స్యకార సంఘాలు, 1 మార్కెటింగ్ సొసైటీకి చెందిన సంఘం ఉంది. వీటిలో 3815 మంది సభ్యులు ఉండగా, మహిళా సంఘాలు నాలుగింటిలో 136 మంది సభ్యులున్నారు. గత ఏడాది మొత్తంగా 532 చెరువుల్లో 1కోటి 40 లక్షల చేప పిల్లలను విడిచారు. ఈ మొత్తం జలాశయాలు 10825 హెక్టార్ల విస్తీర్ణాన్ని ఆవరించి ఉన్నాయి.

**మొదలుకాని తతంగం :**

మూడేళ్ల క్రితం వరకు చేప పిల్లల ఉచిత పంపిణీ చేయడానికి ఏప్రిల్ నెలాఖరు నాటికి టెండర్లు పిలిచి మే రెండో వారం టెండర్లు ఖరారు చేసేవారు. రెండేళ్లుగా ఈ తతంగం ఆలస్యమవుతోంది. అంతే కాకుండా లక్ష్యాన్ని కూడా చేరుకోవడం లేదు. కేవలం 50 శాతం వరకు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ సారి నూరు శాతం పంపిణీ చేస్తారమని భావించినప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఆ దిశగా అడుగులు లేవు స్పష్టత లేదు. రెండేళ్లుగా చేప పిల్లలు పంపిణీ చేసి గుత్తేదారులకు బిల్లులు అరకొరగా చెల్లిస్తుండటంతో

మిగతా 2లో..



**ప్రజాపక్షం/తల్లాడ:** జిల్లా వ్యాప్తంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరిసాగు చేసే రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ మేఘాలు కనిపించడం తప్ప సరైన వర్షాలు లేకపోవడంతో పొలాల్లో నాట్లు వేయాలా..మరికొంతకాలం వేచి చూడాలా? అనే సంధిగ్ధంలో రైతులున్నారు. జిల్లాలోని అనేక మండలాల్లో రైతులు ఇప్పటికే నర్సరీలు సిద్ధం చేసుకున్నారు. అయితే పొలాల్లో తగినంత నీరు లేకపోవడంతో నాట్లు ప్రారంభించలేకపోతున్నారు. కొందరు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పటికీ సాగు పనులు ముందుకు సాగకపోవడంతో

మిగతా 2లో..

# వర్షాలు లేక కష్టాల్లో రైతులు..!

- వరినాట్లపై అయోమయంలో రైతాంగం
- జిల్లావ్యాప్తంగా వరి రైతుల ఆందోళన



## అధికార కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు



- సిపిఐతో ఉన్న మిత్రధర్మాన్ని పాటించకుండా నిబంధనలు వేయడం తగదు : బాగం
- కాల్వ ఆక్రమణ ఆరోపణలపై ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఐ నిజ నిర్ధారణ కమిటీ
- ఆటోనగర్ ఏర్పాటులో మళ్లించిన కాల్వను పునరుద్ధరించాలి : రైతులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సీపీఐతో ఉన్న మిత్రధర్మాన్ని పాటించకుండా రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నిరాధార ఆరోణలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులో ఎన్ఎస్పీ కాల్వను సీపీఐ మాజీ ప్రజాప్రతినధి ఆక్రమించారనే ఆరోపణల నేపథ్యంలో మున్సిపాలిటీ సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ ఘటానా స్థలాన్ని పరిశీలించింది. ఈ పరిశీలనలో 23, 24, 28, 29, 30, 31, 32 వార్డుల్లోని శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ...ఎన్ఎస్పీ కాల్వ ఆక్రమణ జరిగిందనే ఆరోపణలు

మిగతా 2లో..

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత అవసరమైన మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అందులో భాగంగానే నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచేందుకు డ్రైనేజీల నిర్మాణంతో పాటుగా రవాణా సౌకర్యాల మెరుగుదలకు సిసి రహదారులను నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాసిరకం పనులను సహించేది లేదని హెచ్చరించారు. పది కాలాల పాటు ప్రజలు గుర్తుంచుకొనేలా నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు.దీని కోసం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలసత్వం చేయరాదన్నారు. అదే విధంగా ఆయా డివిజన్ ప్రజలు సైతం జరుగుతున్న అభివృద్ధి పనులపై నిఘా పెట్టాలని సూచించారు. అపుడే ప్రజలు ఆశించిన అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. ప్రజల పక్షాన నిలిచే ఎంఎల్ఏగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించటానికి నిరంతరం శ్రమిస్తానని, అభివృద్ధితో పాల్వంచ పట్టణ రూపురేఖలను మార్చటమే లక్ష్యంగా నిరంతరం పని చేస్తానని పునరుద్ఘాటించారు. గత ఆరేండ్లుగా అభివృద్ధికి నోచుకోని 31వ, డివిజన్ పరిధి వేంకటేశ్వర బృందావన కాలనిలో రూ. 56.50 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టడంతో కాలనీ వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మహిళలు పెద్ద ఎత్తున ఎంఎల్ఏ కూనంనేనికి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు.

**– నిరంతర శ్రామికుడు కూనంనేని :**

పేద ప్రజల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రధాత, నిత్య శ్రామికుడు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అని 33వ, డివిజన్ కార్పోరేటర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలు కొనియాడారు. అదే విధంగా మునిసిపల్



కార్పోరేషన్ అధికారులు, ఉన్నతాధికారులు ప్రజా సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కనీసం ప్రజా ప్రతినిధుల ఫోన్‌లు సైతం ఎత్తకుండా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, తహశీల్దార్ దారా ప్రసాద్, పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. తోట నాగరాజు, విద్యుత్ శాఖ ఏడిఈ అబ్దుల్ రెహమాన్, డిప్యూటీ కమీషనర్ విజయానంద్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వర రావు, గుర్రం వెంకటేశ్వర్లు, నునావత్ శ్యామల, నామా కీర్తి, గొర్లె అన్నపూర్ణ, దంతెబోయిన నరేష్,సింధు తపస్వి, సీరపు సుగుణ, మధుచంద్, విజయలక్ష్మి, సిపిఐ నాయకులు శనగారపు శ్రీనివాసరావు, గౌతమి క్రిష్ణ, చెరుకూరి శేఖర్‌బాబు, వైఎస్ గిరి, నాగమణి, ఎస్‌ఏ. రహమాన్, ఆలపాటి ప్రసాద్, కరీం, కాకటి రవీందర్, దినేష్, నరేష్, నవీన్, అంజాద్, రామాచారి, భట్టు హరి, శరప శ్రీను, లక్ష్మి, రాజేశ్వరరావు, జిలాని, భీమానాయక్, ఆది నారాయణ, అశోక్, పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా అసత్యమని అన్నారు. ఆటోనగర్ ఏర్పాటు సమయంలో అసలు పంట కాల్వ మర్గాన్ని మార్చివేశారని, ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ప్రాంత ఆ మార్పుల ఫలితమేనని తెలిపారు. స్థానిక రైతులు కూడా పాత పంట కాల్వను తిరిగి పునరుద్ధరించాలని చాలా కాలంగా కోరుతున్నారని చెప్పారు. రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా అధికారులు పాత కాల్వ మార్గాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని, వాస్తవాలను పరిగణలోకి తీసుకుని అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అలాగే కాల్వ మార్పునకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సిపిఐపై చేస్తున్న అసత ఆరోపణలు, కక్షసాధింపు రాజకీయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఐ..

సిపిఐ పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతనిధి కబ్జాకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సిపిఐ నిజ నిర్ధారణ కమిటీ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. తొలుత వరంగల్‌క్రాస్‌రోడ్డులోని సిపిఐ కార్యాలయం వద్దకు చేరుకొని, అక్కడి నుంచి కాలినడకన ర్యాలీగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అసలు కాల్వ ఎక్కడి నుంచి ఉందనే విషయాన్ని మొత్తం పరిశీలించారు. ఈ సందర్భంగా 28,30,32 వార్డులకు చెందిన సీపీఐ కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ...కాల్వ ఆక్రమణ ఆరోపణలు అవాస్తవమని, సీపీఐ పార్టీపై బురద చల్లాలనే ఉద్దేశంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అసలు కాల్వ ఇక్కడ లేదని, గతంలో ఆటోనగర్ ఏర్పాటు సమయంలో దానిని మరోవైపు మళ్లించారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు పాత కాల్వను




పునరుద్ధరించి, మార్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కాల్వను పునరుద్ధరించాలి : రైతులు

ఆటోనగర్ ఏర్పాటులో ఎన్ఎస్‌పీ కాల్వను మార్చి తమ పొలాలు, నివాసాలవైపు మళ్లించారని అక్కడి రైతులు ఆరోపించారు. ప్రస్తుతం కాల్వగా పేర్కొంటున్నది అసలైన కాల్వ కాదన్నారు. అక్రమ పద్ధతిలో ఏర్పాటు చేసిన కాల్వతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు దారి లేకుండా చేసి, లేని కాల్వను ఉన్నట్లుగా సృష్టించారని ఆరోపించారు. అలాంటి కాల్వను కాకుండా పాత కాల్వను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అటువంటి కాల్వకు బఫర్ జోన్ అంటూ మా భూములను లాక్కోవాలని చూడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యుడు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, మామిడి సుదర్శన్‌రెడ్డి, బట్ట బాబు, వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేవీఆర్ డిగ్రీ కళాశాలలో రూ.2 కోట్లతో అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణం

**పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి, దయానంద్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణం కోసం బుధవారం స్థల పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డి పాల్గొన్నారు.క్రీడా ప్రాంగణం నిర్మాణానికి సంబంధించి అధికారులు కొలతలు చేపట్టగా, మైదానం అభివృద్ధిపై ఎమ్మెల్యే రాగమయి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణం



లోని వ్యాయామ పరికరాలను పరిశీలించిన వారు, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి యువతకు మెరుగైన క్రీడా వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, కమల్ పాషా, ప్రభాకర్, కమీషనర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు లేక కష్టాల్లో రైతులు..!

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. గత కొన్నాళ్లతో పోలిస్తే ఈసారి వర్షాలు ఆలస్యంగా రావడం రైతాంగాన్ని కలవరపెడుతోంది. వాతావరణంలో మేఘాలు కనిపిస్తున్నప్పటికీ వర్షాలు మాత్రం కురవకపోవడంతో భూమి తడవడం లేదు. చెరువులు, కుంటలు, వాగులు పూర్తిగా నిండకపోవడంతో సాగునీటి కొరత మరింత పెరిగింది. బోర్లు ఉన్న రైతులు కూడా విద్యుత్ సమస్యలు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. బోర్ల ద్వారా మొత్తం పొలాలకు నీరు అందించడం సాధ్యం కాకపోవడంతో సాగుపై అనిశ్చితి నెలకొంది. వరి నర్సరీలు ఎక్కువ రోజులు ఉంచితే మొక్కలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు త్వరగా నాట్లు వేస్తే నీటి కొరతతో పంట ఎండిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వ్యవసాయ నిపుణులు వర్షాల పరిస్థితిని గమనిస్తూ దశల వారీగా సాగుపనులు చేపట్టాలని సూచిస్తున్నారు. తగినంత నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో మాత్రమే నాట్లు వేయాలని, నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలను కూడా పరిశీలించాలని సలహా ఇస్తున్నారు. జిల్లాలోని పలు మార్కెట్లలో వ్యవసాయ పెట్టుబడుల ధరలు పెరగటం కూడా రైతులకు భారంగా మారింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగినా.. పంటపై నమ్మకం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాభావం కొనసాగితే ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని, అధికారులు అంచనా వేస్తున్నారు. సమయానికి వర్షాలు పడకపోతే దిగుబడులుపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయవర్గాలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన సలహాలు, సాగునీటి నిర్వహణపై అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వర్షాలు కురిసి పరిస్థితులు మెరుగుపడాలని జిల్లా రైతాంగం ఆశగా ఎదురుచూస్తోంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా రైతుల దృష్టి అంతా ఆకాశంపైనే ఉంది. ఎప్పుడు వర్షం కురుస్తుందా? ఎప్పుడు నాట్లు వేయాలా? అనే ఆందోళనతో ప్రతీ రోజు గడుపుతున్నారు. సరైన సమయంలో వర్షాలు కురుస్తేనే ఖరీఫ్ సీజన్ గాడిలో పడే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

# చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు

(మొదటిపేజీ తరువాయి)

కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేనట్లు తెలుస్తోంది.

**ఎదుగుదలపై ప్రభావం :** చెరువులో చేపలను జూలై, ఆగస్టు నెలల్లో జలాశయాల్లో వదలాల్సి ఉంటుంది. అప్పుడే డిసెంబర్ లేదా జనవరి మాసంలో చేపలను మత్స్యకారులు పట్టుకుని విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. చేప పిల్లలను వదలడం ఆలస్యమైతే వాటి ఎదుగుదలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. సెప్టెంబర్ మాసంలో వదిలితో అవి కిలో సైజుకు రావడానికి ఫిబ్రవరి నెల పట్టే ప్రమాదం ఉంది. ఇంకా పెరగాలంటే మంచి ఎండాకాలం ఏప్రిల్, మే నెలలు వచ్చే స్థాయి. వేసవిలో నీటి నిల్వలు తగ్గిపోయి చేపలు మృత్యువాత పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు.

**ఎల్‌నినో ఎఫెక్ట్ :** మత్స్యకారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎల్‌నినో ఎఫెక్ట్ పడుతోంది. ఈ వానా కాలంలో ఆశించిన స్థాయిలో వర్షాపాతం నమోదు కాక పోవడంతో చెరువులు, కుంటలు, ఇతర నీటి జలాశాయలాల్లో నీరు చేరలేదు. నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయన్న కారణంగా ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కార్యక్రమంపై ముందడుగు వేయడం లేదని వాదన వినవస్తోంది. దీంతో ఈ ఏడాది ఈ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ ఉంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతుండగా మత్స్యకారులు ఆందోళనలో పడ్డారు.

**పెట్టుబడి సహాయం అందించాలి :** రైతులకు పెట్టుబడి సహాయం అందించిన మాదిరిగానే మత్యకార సంఘాలకు కూడా నగదు బదిలీ చేస్తూ పెట్టుబడి సహాయాన్ని అందించాలనే డిమాండ్ మొదలైంది.నేరుగా మత్స్యకారులే చేప పిల్లలు కొనుగోలు చేసుకునేందుకు వీలుంటుందని అంటున్నారు. ప్రతీ ఏటా టెండర్లు నిర్వహించి చేపపిల్లలు పంపిణీ చేసే విషయంలో భారీ అవినీతి చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నేరుగా మత్స్యకారులకు నగదు బదిలీ చేయడమే ఉత్తమమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా నష్టపోయే మత్స్యకార కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**గత ఆరేళ్ల వివరాలు ఇలా :** 202021 సం. మొదలుకుని 202526 సం. వరకు ఆరేళ్ల పాటు ప్రభుత్వం సబ్సిడిపై అందించిన చేప పిల్లలను ఆయా చెరువుల్లో వదిలారు. మత్స్యశాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం 202021 వ సం.లో 691 చెరువులకు గానూ 17,78,280 చేప పిల్లలను వదిలారు. 202122లో 698 చెరువుల్లో 12,17,840, 202223లో 743 చెరువులకు గానూ 17,74240,202324లో 743 చెరువుల్లో 17,74,590, 202425లో 707 చెరువుల్లో 8.02,020, 202526లో 532 చెరుల్లో 14.06.070 చేప పిల్లలను వదిలారు. గత ఏడాది, అంతకి ముందటేడు టార్గెట్‌లో 50 శాతం చేప పిల్లలను మాత్రమే పంపిణీని చేయడం గమనార్హం.

# ఉపాధిహామీ పనులు చేపట్టాలని వినతి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ చట్టం పనులు చేపట్టాలని వైరా మండల అభివృద్ధి అధికారికి బిఆర్ఎస్ వైరా మండల నాయకులు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా గ్రామాల్లో రైతు వారి పనులు దొరకక పేద ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని వారు తెలియజేశారు. గ్రామాల్లో ఇటువంటి ఉపాధిహామీ పనులు దొరకక ప్రజలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని, చిన్న సన్నకారు రైతులు వారి సొంత పొలాల్లో కూడా పనులు లేక ఆకాశం వైపు ఎదురుచూస్తున్నాని వారు వినతిపత్రంలో తెలిపారు. కావున ప్రభుత్వం స్పందించి ఎన్ఆర్ఈజిఎస్ పనులు 200 రోజులకు పెంచి పేద ప్రజలను ఆదుకోవాలని తక్షణం యుద్ధప్రాతిపదికన ఉపాధిహామీ పనులు చేపట్టి పేద ప్రజల ప్రయోజనాలు కాపాడాలని ఆ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్శ్రీస్ వైరా మండల నాయకులు 8వ వార్డు కౌన్సిలర్ చిలకా చిన కోటయ్య, మండల నాయకులు వల్లాపురం ఉపసర్పంచ్ వేల్పుల నారాయణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అయినాల కనకరత్నం, 17 వార్డు మాజీ కౌన్సిలర్ తడికమళ్ల నాగేశ్వరరావు, బక్కా వెంకటేశ్వర్లు, మరో నాయకులు తడికమళ్ల నాగేశ్వరరావు, ముదిగొండ పుల్లయ్య, నారపోగు కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్

**-అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి**
**-ఇసుక సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్‌లైన్‌లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖాధికారులతో కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు ఎంత పరిమాణం ఇసుక ఎక్కడెక్కడ నుండి పొందింది నివేదిక సమర్పించాలన్నారు. ఇసుకను టిజిఎండిసి, స్యాండ్ బజార్, స్థానికంగా సమకూర్చుకోవాలని ఈ బుకింగ్ ఆన్‌లైన్‌లోనే చేయాలన్నారు. జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్‌లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక రీచ్‌ల వారీగా వచ్చిన ఆదాయం, వివరాలు వెంటనే సమర్పించాలని ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ శాఖలు తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై సమస్యలు ఉంటే వెంటనే నివేదికలు అందించాలన్నారు. ఎలాంటి అలసత్వం లేకుండా నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనుల పూర్తికి కార్యాచరణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పిఆర్ఎస్ఈ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్‌రావు, పివో టిజిఎండిసి జి. శంకర్, మైన్స్ ఏజి ఎ. రమేష్, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, వైద్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, పిఆర్ ఈఈలు మహేష్‌బాబు, రామకోటి, డిఈలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, అధికారులు పాల్గొన్నారు.

# 18, 19న గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు

**-రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 18, 19 తారీఖున పాల్వంచలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పిలుపునిచ్చారు. బుధవారం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు అఖిల భారత ఆదివాసీ మహాసభ ఇంచార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి డి. అనీరాజా, జాతీయ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత ఆదివాసీ మహాసభ పసుపతి కోల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలకు ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలలో గిరిజనుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, అధ్యక్షులు బానోత్ రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా నర్సింహా, పాల్తియా శ్రీను, గుగులోత్ శ్రీను, బానోత్ రామ్మూర్తి, భూక్యా శ్రీకాంత్, గుగులోత్ లచ్చిరాం, బోడా చిన్న పాల్గొన్నారు.

# ఎస్‌బిఐ శాలరీ ప్యాకేజీ సౌకర్యాలను సద్వినియోగించుకోండి

**-ఎస్‌జిఎస్‌పి కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రత, మెరుగైన బ్యాంకింగ్ సేవలు, కుటుంబ సభ్యులకు అదనపు ప్రయోజనాలు కల్పించే లక్ష్యంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజీ (ఎస్‌జిఎస్‌పి) ద్వారా లభించే ప్రయోజనాలను ప్రభుత్వ ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బిఐ రూపొందించిన ఎస్‌జిఎస్‌పి శాలరీ ప్యాకేజీ కరపత్రాలను కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌బిఐ అధికారులు ప్యాకేజీలో ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న ప్రత్యేక సౌకర్యాలు, బీమా రక్షణ, కుటుంబ సభ్యులకు లభించే ప్రయోజనాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎస్‌బిఐ ప్రత్యేకంగా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజీ (ఎస్‌జిఎస్‌పి) ద్వారా అనేక విలువైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం సాధారణ శాలరీ ఖాతాలు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఖాతాలను ఎస్‌జిఎస్‌పి ఖాతాలుగా మార్చుకోవడం ద్వారా అదనపు ఆర్థిక భద్రతతో పాటు ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఎస్‌బిఐ రీప్తె ద్వారా ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందగలరని, అవసరమైన సమయాల్లో ఆకర్షణీయమైన రుణ సదుపాయాలు, ప్రాధాన్య సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎస్‌జిఎస్‌పి ద్వారా కోటి రూపాయల వరకు ఉచిత ప్రమాద బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకుని తమ శాలరీ ఖాతాలను ఎస్‌జిఎస్‌పి ఖాతాలుగా మార్చుకోవాలని ఇందుకు సంబంధించి సమీప ఎస్‌బిఐ శాఖను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ వనపల్లి శ్రీనివాసరావు, ఛీఫ్ మేనేజర్ రామ్ బరన్, ఎల్‌డిఎం ఎ. రవిప్రసాద్, కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్ మేనేజర్ సునీత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షులు జోనెబోయిన పాపయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేలోత్ దేవ్‌సింగ్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షులు కోటేష్ నాయక్, వార్డు సభ్యులు పరిమిశెట్టి పద్మనాభం, జోనెబోయిన అచ్చయ్య, ఎస్‌కె రఫీ, పొన్నం యాదగిరి, విష్ణుమూర్తి, నాయకులు రాము నాయక్, టిడిపి నాయకులు నాగండ్ల లక్ష్మణ్‌రావు, స్థానిక పెద్దలు పొద్దుటూరి కోటిరెడ్డి, నాగండ్ల పుల్లయ్య పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం పరిశీలించిన ప్రత్యేకాధికారి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి మహ్మద్ ముజాహిద్ పరిశీలించారు. బుధవారం పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో మండల ప్రత్యేకాధికారి ముజాహిద్ మాట్లాడారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు శాతాన్ని, వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంటశాల, పరిసరాలను, వండిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేకాధికారి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తుంది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించినవిధంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. నాణ్యమైన ఆహార వస్తువులను ఉపయోగించాలని, వంటశాలతో పాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గాయత్రి, ఉపాధ్యాయులు రమేష్, మల్లికార్జునరావు, సోమ్లా, రమాదేవి, నాయకులు పొట్లపల్లి రాజా పాల్గొన్నారు.

# ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్స

**-యశోద ఆసుపత్రి పల్మనాలజిస్టు డాక్టర్ తపస్వి కృష్ణ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్వాసకోశ సమస్యలతో ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో ఎక్మో (కృత్రిమ గుండె ఊపిరితిత్తుల పరికరం) విధానం ఒక సంజీవనిలా మారుతుందని హైదరాబాద్ సోమాజీగూడ యశోద ఆసుపత్రి కన్సల్టెంట్ ట్రాన్స్ ప్లాంట్ పల్మనాలజిస్టు డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. బుధవారం యశోద మెడికల్ సెంటర్ ఖమ్మం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ తపస్వి కృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు హైదరాబాద్ సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రాణం నిలిపే ఎక్మో (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం చివరి దశ ఇంటర్‌స్టీసియల్ లంగ్ డిసిజ్ లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు ఈ ఎక్మో లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామన్నారు. ఈ విధానంలో అత్యాధునీక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థల పని చేస్తుందన్నారు. ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి కార్బన్‌డైయాక్సైడ్‌ను తొలగించి మరల శరీరంలోకి పంపుతుందన్నారు. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు దాత దొరికే వరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైందని డాక్టర్ తపస్వి తెలిపారు. సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్య శాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అన్నారు. రక్తం గడ్డ కట్టడం, అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ గుండె, ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసియు నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్ర చికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందన్నారు. ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని ఎక్మో వంటి ఆధునాతన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపవ చ్చునన్నారు. శస్త్ర చికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం, వెంటిలేటర్ల నుండి తొలగించి కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామన్నారు. క్రియాశీలక శారీరక వ్యాయమాల ప్రక్రియ ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్స విధానం తోడ్పాడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు.ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

# శాతవాహన రైలు నిలపాలని ఎంపికి వినతి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రం ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ ఇప్పించాలని రైల్వే గేటు పై ఆర్వోబి నిర్మించాలని కోరుతూ ఎంపి రఘురాం రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు వినతిపత్రం అందించారు. మండలలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో భాగంగా ఎంపి రఘురాంరెడ్డి బుధవారం పర్యటించారు. మీనవోలు, బనిగండ్లపాడు, రామన్నపాలెం, రేమిడిచర్ల తదితర గ్రామాల్లో రూ.58లక్షల రూపాయల ఎంపి గ్రాంట్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన స్థానిక సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎర్రుపాలెంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపి రఘురాంరెడ్డికి ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ విశిష్టత, జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, తక్కెళ్లపాడు శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయాల విశిష్టతను తెలియచేస్తూ ఎర్రుపాలెంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు నిలపాలని కోరారు. ఇటీవల జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రత్యేకంగా మూడురోజులు శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలిచిన సంఘటనను ఎంపి రఘురాంరెడ్డికి వివరించారు. ఖమ్మం ఎంపిగా ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, మల్లెల లక్ష్మణరావు, దేవరకొండ వెంకటరత్నం, కొండ, శీలం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** టీఎల్‌పేటలో నిర్వహించిన ఎస్ఐఆర్(ప్రత్యేక ఓటరు జాబితా సవరణ)కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎంఎల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ పరిశీలించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు బాదావత్ బాలాజీ అధ్యక్షతన వహించారు. ఈసందర్భంగా బీఎల్‌ఓలతో సమావేశమై వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివరాలు సరి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏన్కూరు మండల నాయకులు ఏంద్రతి మోహన్‌రావు, గిద్దగిరి సత్యనారాయణ, గుగులోత్ సుమలత, టీఎల్‌పేట సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, ఉప సర్పంచ్ నామా వెంకయ్య, బీఎల్‌ఏ ఎస్‌కే ఖాసీం, గడం వెంకటేశ్వర్లు, పూర్ణకంటి నాగరాజు, మాదేని సాయి, భూక్య శివ, కోనపల్లి నరేష్, చల్లా కోటేశ్వరరావు, ఉపేందర్, బారపాటి వెంకటనారాయణ, లక్ష్మయ్య, రవి, భూక్య ధర్మా, కడియాల సుధాకర్, రామస్వామి, ఇంజం దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

## వరుణదేవుడు కరుణించాలని గ్రామదేవతలకు జలాభిషేకం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండలంలోని పిండిప్రోలు గ్రామంలో వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ పిండిప్రోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త, ఉపసర్పంచ్ చామకూరి రాజు పాలకమండలి ఆధ్వర్యంలో గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు తలపై జల బిందెలను మోసుకుంటూ గ్రామవీధుల గుండా ర్యాలీగా బొడ్రాయి ముత్యాలమ్మ ఆలయం వరకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు కోలాటం ఆటపాటలతో నృత్యాలతో వరుణదేవున్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కామల్ల సువార్త, ఉపసర్పంచ్ చామకూరి రాజు మాట్లాడుతూ మంచి వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందాలని, ప్రతి రైతు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు కాంపాటి ప్రమీల, పులుగుజ్జు ఉపేంద్ర, పసలాది ముత్తయ్య, చామకుమారి రేణుక, గోకినపల్లి సరోజిని, రైతులు చల్లా వెంకటేశ్వర్లు, పద్మనాభుల సుధాకర్, తాతా రవీందర్, చామకూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన పాఠశాల ప్రహరీగోడ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని బోదులబండ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూలింది. బోదులబండ పాఠశాల కు ఉన్న ప్రహరీ గోడ బుధవారం అకస్మాత్తుగా గోడ కుప్ప కూలింది. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవటం ప్రమాదం తప్పింది. పాఠశాల కు వెనక భాగం మొత్తం వ్యవసాయ పోలాలు ఉండటంతో ప్రహరీ లేకపోవటంతో విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కూలిన పాఠశాల ప్రహరీ గోడ ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతు నరేందర్, సర్పంచ్ కట్టెకోల నాగార్జున లు సందర్శించారు. విషయం ను మండల విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నూతనంగా ప్రహరీ గోడ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు.

## ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ విద్య ను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, తహశీల్దార్ పి.రాంప్రసాద్ లు సూచించారు. మండలం లోని రాయగూడెం లో ప్రీ ప్రైమరీ సెక్షన్ ను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్య కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే ప్రోత్సాహకాలను పొంది, ప్రయోజకులు కావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్య ను అందిస్తుందన్నారు. పాఠశాల లను బలోపేతం చేసేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతి రావు, కాంప్లెక్స్ హెచ్యం నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ. నాగేశ్వరరావు, సర్పంచ్ వేణు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా రహదారులను అభివృద్ధి చేయండి

**-కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల లేఖలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మం అశ్వారావుపేట రహదారి నాలుగు వరసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింక్ మంజూరు, కొత్తగూడెం పాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో మంత్రి తుమ్మల వివరించారు. ఏపి, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతా రామ చంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం నుండి వెళ్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు భారీ సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పది కిలో మీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు) ఏర్పడి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని లేఖలో తెలిపారు. భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చిన దానికి రూ. 120 కోట్ల భారీ వ్యయం అవుతుందని దానికి బదులు భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మాణం రూ. 25 కోట్లతో పూర్తి చేయవచ్చునని తెలిపారు. తక్కువ ఖర్చుతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. జాతీయ రహదారి 365 బిబిలోని ఖమ్మం అశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్ ఖమ్మం మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి తెలిపారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రస్తుతం రహదారుల విస్తరణకు బదులు ఖమ్మం దేవరపల్లి (365 బిజి), వరంగల్ ఖమ్మం (163 జి) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందన్నారు. ప్రస్తుత రహదారుల విస్తరణను పక్కనపెట్టినట్లు తెలిపారు. ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు 122 కిలో మీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని 40 బ్లాక్ స్పాట్లు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా భద్రత, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా నాలుగు వరుస పనులకు ప్రత్యేక కేసుగా పరిగణించి మంజూరు చేయాలని లేఖలో కోరారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంతో ఖమ్మం నగరానికి పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ దిశల్లో బైపాస్ రోడ్డు ఏర్పడిందని ఖమ్మం ఔటర్ బైపాస్‌కు 80 శాతం సిద్ధమైందని ఖమ్మం కురవి, వరంగల్ ఖమ్మం మార్గానికి మధ్య ఏడు కిలో మీటర్ల కీలక అనుసంధాన లింక్ మిగిలి ఉందని వివరించారు. ఖమ్మం కురవి మార్గాన్ని అమరావతి నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్‌కు హైవేకు అనుసంధానిస్తే ఖమ్మంకు చుట్టూ రింగు రోడ్డు పూర్తి స్థాయిలో సహకారం అవుతుందని మంత్రి తెలిపారు. దీనితో నగరంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గి రద్దీతో పాటు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల మీదుగా సాగే జాతీయ రహదారి ప్రస్తుతం కొత్తగూడెం పాల్వంచ పట్టణాల గుండా వెళ్తుందని దీని వల్ల తీవ్ర ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సుమారు 23 బ్లాక్ స్పాట్‌లు ఏర్పడి ప్రాణ నష్టం సంభవిస్తుందన్నారు. కొత్తగూడెం పాల్వంచ మధ్య 25 కిలో మీటర్ల మేర బైపాస్ నిర్మించి ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 30లను అనుసంధానించాలని లేఖలో కోరారు. ఈ ప్రాజెక్టుల మంజూరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రహదారి భద్రత మెరుగుపడడంతో పాటు ప్రయాణ సమయం తగ్గి పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని మంత్రి తుమ్మల లేఖలో పేర్కొన్నారు.

## గిరిజన యువతీ యువకులు జీవనోపాధిని పెంచుకోవాలి

**- ఐటిడిఏ పిఒ రాహుల్**







**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు వృత్తి నైపుణ్య శిక్షణలు తీసుకుని జీవనోపాధిని పెంపొందించుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం వారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో వరల్డ్ స్కిల్‌డే సందర్భంగా నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి పథకాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో పాటు దూసుకుపోతున్నారని, మారుతున్న కాలనీకి అనుగుణంగా ప్రతీ యువతీయువకులు చెడు భావాలను మనస్సులో నుండి తీసేసి మార్పుచెంది వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ఈవిధంగా పోతున్న చైనా జపాన్ దక్షిణ కొరియా దేశాలు ముందుకు పోతున్నాయన్నారు. పిజి,బిటెక్ చేసిన యువతీ యువకులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని వివిధ ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తూ జీవనోపాధి కల్పించుకుంటున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో త్వరలో స్కిల్ డవల్ప్మెట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలువచ్చేంత వరకు ప్రతీ ఒక్కరూ ఐటిడిఏ భవిత్ సెల్ ద్వారా నిర్వహించే వివిధ రకాల వృత్తి శిక్షణల్లో తర్ఫీదు పొంది జీవనోపాధిని పెంపొందించుకోవాలన్నారు. ఇప్పటికే పలు రకాల వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, పిఇటిసి ప్రిన్సిపల్ డా.వీరునాయక్, జేడిఎం హరికృష్ణ, వైటిసి ఇంచార్జ్ శ్రీనివాస్, ఇన్‌స్ట్రక్టర్ జ్యోతి, ఎండి అఫీస్, రజియాబేగం, బాధావత్ సంధ్య భవిత సెల్ సిబ్బంది సమ్మయ్య, యువతీయువకులు పాల్గొన్నారు.

## షిఫ్టింగ్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్**





**ప్రజాపక్షం/వైరాః** షిఫ్టింగ్ ఓట్ల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కొత్తగా నమోదయ్యే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ అన్నారు. వైరా మున్సిపాలిటీ 1వ వార్డులో బుధవారం బిఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, అప్పం సురేష్ నిర్వహించిన ఎస్ఐఆర్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వైరా నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇంచార్జి ఆర్‌జెసి కృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతుండగా, కొన్ని జిల్లాలో బిఎల్‌వోలకు అవగాహన లేకోవడం వలన ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వైరా 1వ వార్డులో 836 దరఖాస్తుల్లో 702 పూర్తికాగా, సుమారు 90% ప్రక్రియ పూర్తయిందన్నారు. 60 షిఫ్టెడ్, మరణించిన ఓటర్లకు సంబంధించిన ఫారాలు ఉన్నాయని పేర్కొంటూ ఇక్కడ బిఎల్‌వోల పనితీరు సంతృప్తికరంగా ఉందని అభినందించారు. అయితే షిఫ్టింగ్ ఓట్ల నమోదులో ఇంకా సందిగ్ద పరిస్థితులు ఉన్నాయని, కొత్తగా వచ్చిన వారికి ఓటు నమోదు విషయంలో ఇబ్బందులు ఎదురుకాకుండా జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎవరి ఓటు కూడా కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్టా కృష్ణార్జునరావు, బానోతు మనీషా లక్ష్మి, లకావత్ గిరిబాబు, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, 8వ వార్డు కౌన్సిలర్ చిలకా కోటయ్య, 11వ వార్డు కౌన్సిలర్ దొంతబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు మాదినేని ప్రసాద్, లాల్‌మహ్మద్, నూకల వాసు, మిట్టపల్లి కిరణ్, ఏదునూరి శ్రీను, పట్టణ మాజీ మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, వల్లాపురం ఉప సర్పంచ్ వేల్పుల నారాయణ, పాసంగులపాటి శివ, తన్నీరు కిషోర్, కారుకొండ బోస్, అయినాల కనకరత్నం, ఫణితి శాంతయ్య, బొడ్డు రామకృష్ణ, వేముల శివ, మాదినేని లక్ష్మణ్, దేవరాజు, కందుల ఓంకార్, మాచర్ల శంకర్, దాసరి శ్రీను, ముదిగొండ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే





**ప్రజాపక్షం/చుంచుపల్లిః** పీఏసీఎస్ కొత్తగూడెం సంఘ పరిధిలోని చుంచుపల్లి మండల సంఘ కార్యాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రైతుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని యూరియాను పొందాలని సూచించారు. చుంచుపల్లి హౌసింగ్ బోర్డులో ఏర్పాటు చేసిన కొత్త ఎరువుల పంపిణీ కేంద్రాన్ని చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సంఘ అధ్యక్షుడు మందే వీర హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు నేరుగా ఆన్‌లైన్‌లో యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికే సుజాతనగర్, ఏఎంసీ లక్ష్మీ దేవిపల్లి ప్రాంతాల్లో ఎరువుల పంపిణీ కేంద్రాలు ఉన్నప్పటికీ, రైతుల సౌకర్యార్థం చుంచుపల్లి హౌసింగ్ బోర్డులోని సొసైటీ కార్యాలయంలో కొత్తగా ఎరువుల పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాధరావు, సంఘ డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, చుంచుపల్లి వ్యవసాయ అధికారి రాజేశ్వరి, కొత్తగూడెం వ్యవసాయ అధికారి కరుణామయి, ఏఈఓలు మమత, ప్రసాద్, చుంచుపల్లి సర్పంచ్ బి.వీరన్న, విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ, విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి, కొత్తగూడెం ఏఎంసి మాజీ అధ్యక్షుడు రాంబాబు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన సమాఖ్య మహాసభలను జయప్రదం చేయండి

**- 18న మహా ప్రదర్శన, 19న ప్రతినిధుల సభ**
**- భద్రాచలం, చర్లలో ప్రచార కరపత్రాలు విడుదల**
**- గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కల్లూరి**



**ప్రజాపక్షం/భద్రాచలం/చర్ల :** ఈ నెల 18,19 తేదీల్లో పాల్వంచ కేంద్రంగా జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య(టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలను జయప్రథం చేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం సిపిఐ డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈమేరకు ఆయన బుధవారం భద్రాచలం, చర్ల సిపిఐ కార్యాలయాల్లో ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం కల్లూరి మాట్లాడుతూ గిరిజనుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ నెల 18,19 తేదీల్లో పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) 3వ రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతాని చెప్పారు. మహాసభల తొలిరోజు కనీ వినీ ఎరుగని రీతిలో భారీ ప్రదర్శన ఉంటుందని, లారీ ఓనర్స్ అసిసోయేషన్ హాల్లో రెండో రోజున ప్రతినిధులు సభ ఉంటుందన్నారు. ఈ పోరాట మహాసభల్లో గిరిజనులు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రథం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెడ్డి శివాజీ కంభంమెట్టు శ్రీనివాస్ సాధనపల్లి సతీష్ అకోక్ కుమారి శేఖర్. చర్లలో అడ్డగర్ల తాతాజీ నూపా పోతయ్య కోటి ముత్యాలరావు కల్లూరి సీతారాములు సోడి సీతారాములు కొమరం కోటేశ్వరరావు కట్టం నాగేశ్వరరావు మడివి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్లపై పోలీసుల నిఘా

**- జిల్లా కేంద్రంలో భారీ తనిఖీలు**
**- 36 కేసుల నమోదు, రూ. 7510 జరిమానా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రోడ్డుభద్రతా ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా మంగళవారం కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లఘించిన మొత్తం 36 వాహనాలపై పోలీసులు కేసులు నమోదు చేసి రూ.7510 జరీమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులంతా తమ వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించేలా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్లను వక్రీకరించడం అంకెలను మార్చడం నెంబర్లు కనిపించకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన యజమానులు తమవాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను ఉంచుకోవడంతో పాటు ప్రతొక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. పట్టణంలో రోడ్డు భద్రతను పటిష్ఠం చేసేందుకు ఇటువంటి డ్రైవ్‌లు నిరంతరం చేపడతామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఎఐటీయూసీదే..

**-సింగరేణికి అన్ని బొగ్గు బ్లాకులు కేటాయించాలి**
**-కే సారయ్య, ఎండి నజీర్ అహ్మద్**




**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి పరిరక్షణకు రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో ముందుకు రావాలని, తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఎఐటీయూసీనే చేపట్టిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య అన్నారు. కేటీసీలో గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి మాలోత్ హరిసింగ్ అధ్యక్షతన జరిగిన ఫిట్ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శది ఎండి నజీర్ అహ్మద్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించకుండా ప్రైవేట్ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ 56వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ వేతన కమిటీ ఏర్పాటు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, మారుపేర్ల సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలు సహా 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టులో ఇతర సంఘాలతో కలిసి సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి మాలోత్ హరిసింగ్, సహాయ కార్యదర్శులు బాలుకుమార్, షేక్ సర్వర్, జీపీ శ్రీనివాస్, నూనె శ్రీనివాస్, అజ్మీరా కిషోర్, కరుణశంకర్, అహ్మద్, వెంకట నర్సయ్య, వినీత్ కుమార్, ఉమా మహేశ్వరరావు, వినయ్ బాబు, పైడి రాజు, ప్రణయ్ కుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నేడు జిల్లాలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించనున్నారు. మణుగూరు ప్రభుత్వ జూ. కాలేజీ గ్రౌండ్‌లో హెలీకాప్టర్ దిగిన తర్వాత అమ్మగారి పల్లిలో గల సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి అక్కడే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతారు. అక్కడి నుండి హెలీకాప్టర్ ద్వారా ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలంలోని యాతాలకుంట గ్రామం వద్ద గల సీతారామ ఎత్తిపోతలపథకం టెన్నల్‌ను పరిశీలించి అక్కడే అధికారులతో సమావేశమవుతారు. అక్కడి నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌లో గల పొంగులేటి క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుండి గోదుమ వాగు బ్రిడ్జీ వరకు డివైడర్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారు. పాల్వంచలో దమ్మపేటపాల్వంచ డబుల్ రోడ్‌కు శంఖుస్థాపన చేస్తారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు, భూభారతి అమలుపై రివ్యూ మీటింగ్ నిర్వహిస్తారు.

## సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/ములకలపల్లి:** తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీను మాతృమూర్తి తుర్రం బుచ్చమ్మ మృతికి అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను బీఎల్‌ఏలు అప్రమత్తంగా పర్యవేక్షించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులు కాంగ్రెస్ పాలనలో నిలిచిపోయాయని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్ట్ నీటి కోసం బీఆర్ఎస్ చేపట్టిన పోరాటాల ఫలితంగానే ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాలకు సాగునీరు వచ్చిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ హామీల అమలు వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో గుండాలపాడు సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, నాయకులు సెనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, నందమూరి సురేష్, మాజీ వార్డు సభ్యుడు సున్నం కృష్ణ, పురేటి నరసింహారావు, సెట్టిపల్లి భాస్కర్‌రావు, కొండ్రు మధు, సోడే కేశవరావు, పుప్పాల గోపి, రవ నరేష్, సామ్యూల్, కొండ్రు వంశీ, కొండ్రు సత్యనారాయణ, ధర్మరాజు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు అటవీ సంరక్షణపై అవగాహన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సోంపల్లి పంచాయితీలో గల బుద్ధగూడెం గ్రామంలో పాల్వంచ రేంజ్ ముసలమడుగు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అనార్కలి ఆధ్వర్యంలో ఆదివాసీలకు అటవీ సంరక్షణ , పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పోడు సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు లేని భూముల్లో పోడు సాగు చేయరాదని, అడవులను ఆక్రమించడం, ప్లాంటేషన్ల ధ్వంసం చేయడం, అడవులకు నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణలో గ్రామస్తులు అటవీ శాఖకు సహకరించాలని, అక్రమ కార్యకలాపాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో సోంపల్లి మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సోంపల్లి బీట్ ఆఫీసర్ సోడే శ్రీరాములు, ముసలమడుగు ఈస్ట్ బీట్ ఆఫీసర్ మడకం వీరేందర్, వెస్ట్ బీట్ ఆఫీసర్ బానవత్ సురేష్, చెరువు సింగారం బీట్ ఆఫీసర్ భూక్య పద్మ, నకిరిపేట బీట్ ఆఫీసర్ దొడ్డ పెద్ద రామ్మూర్తి, చెరువు సింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్, ముసలమడుగు నార్త్ బీట్ ఆఫీసర్ మూడ్ ఝాన్సీతో పాటు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రముఖ న్యాయవాది మృతి



**ప్రజాపక్షం/ఇల్లందు:** గుండెపోటుతో ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి నాయక్(42)మృతి చెందారు. బుధవారం ఉదయం గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చికిత్స నిర్వహిస్తున్న క్రమంలో గుండెల్లో నొప్పి తీవ్రమై మృతి చెందారు. ఆయన మృతి పట్ల స్థానిక మున్సిపల్ ఛైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, కాంగ్రెస్ నాయకులు మేకల శ్యామ్ సుందర్, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు.

## రాయల చంద్రశేఖర్‌కు నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం గ్రామంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు, ఏఐయుకేఎస్ ఖమ్మం డివిజన్ నాయకుడు గుగులోత్ తేజ నాయక్ మాట్లాడుతూ రైతాంగ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సభను జూలై 16న ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల నాయకుడు పులకాని సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, రైతాంగ ఉద్యమంలో చంద్రశేఖర్ సేవలను నాయకులు స్మరించారు. ఈకార్యక్రమంలో నాయకులు రావుల నాగేశ్వరరావు, కోయిల శ్రీనివాసరావు, పబ్బుల రాము, పోలేపోయిన పెద్ద వెంకన్న, గుంపిడి నరేందర్, బుచ్చి రాములు, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు అత్యంత విలువైంది..



**ప్రజాపక్షం/వైరా :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైందని, అర్హులైన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాం దాస్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రజలకు అందించిన అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య సాధనమని పేర్కొన్నారు. ప్రజలు తమ భవిష్యత్తును, తమ ప్రాంత అభివృద్ధిని, తమ సమస్యలకు పరిష్కారాలను నిర్ణయించుకునే అవకాశం ఓటు ద్వారానే లభిస్తుందని అన్నారు. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత కూడా అని ఆయన స్పష్టం చేశారు. అర్హత ఉన్నప్పటికీ ఓటరుగా నమోదు కాకపోవడం వలన ఎన్నికల సమయంలో తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవకాశం కోల్పోతామని, అదే విధంగా ఓటు వినియోగించుకోకపోవడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం తగ్గిపోవడానికి కారణమవుతుందని తెలిపారు.

### ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి: ఎమ్మెల్యే

ముఖ్యంగా యువత కొత్తగా అర్హత పొందిన పేరు నమోదు చేయని ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. నిర్దేశిత గడువులోపు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైందని, ఒక్క ఓటు కూడా ఫలితాన్ని ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుందని గుర్తు చేశారు. అందువలన ఓటు హక్కును చిన్నచూపు చూడకుండా దానిని బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. అలాగే గ్రామాలు, పట్టణాలు, వార్డుల స్థాయిలో ప్రజల్లో ఓటు హక్కుపై విస్తృత అవగాహన కల్పించాలని, ఓటరు నమోదు ప్రక్రియపై సమాచారం అందించి ప్రతి అర్హుడు జాబితాలో చేరేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలపరచాలంటే ప్రతి పౌరుడు చైతన్యవంతంగా పాల్గొనాల్సిన అవసరం ఉందని, ఓటరు నమోదు నుంచే ఆ బాధ్యత ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పేర్కొన్నారు.

# వైరా మున్సిపల్ కమీషనర్‌కి వైస్ చైర్మన్ కట్ల సంతోష్ వినతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ కార్యాలయం నందు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలపై డాక్టర్ కాపా మురళీకృష్ణకి ఏమి సంబంధం ఏమిటి అని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ బుధవారం మున్సిపల్ కమీషనర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ వినతిపత్రంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ మున్సిపాలిటీకి సంబంధించి ప్రజాప్రతినిధి కానప్పటికీ ప్రతి రోజు చైర్ పర్సన్ రూమ్ నందు మేడల్ కుర్చీ ప్రక్కన కుర్చీ వేసుకొని గంటల కొద్ది కూర్చోడానికి ఏ విధమైన హక్కు ఉంది, మున్సిపాలిటీ సంబంధించి అన్ని కార్యక్రమాలపై వారి పర్యవేక్షణ, మున్సిపాలిటీ సిబ్బందికి ఆదేశబూలు జారీ చేయడానికి వారికి ఏమి హక్కు కలదు, మున్సిపాలిటీలోని అన్ని రంగాల కార్మికులకు ఆదేశాలు జారీ చేయుటకు, సిబ్బంది విధి నిర్వహణలో వారికి ఏమి హక్కు కలదు, అధికారులతో కలిసి వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో వార్డుల కార్యక్రమాల్లో వారి జోక్యంకు వారికి ఏమి హక్కు కలదు, మున్సిపాలిటీకి సంబంధించి మీరు ప్రతి విషయంలో వారి కనుసన్నల్లో వారి ఆదేశాను సారం పనిచేయుటకు వారికి ఏమి హక్కు కలదు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుల్లో వైరా మున్సిపాలిటీ నందు, మున్సిపాలిటీ కార్యక్రమాలపై డాక్టర్ కాపా మురళీకృష్ణ పెత్తనం తగ్గించాలని, ఒకవేళ మళ్లీ ఇదే పరిస్థితి కొనసాగితే మేము పై అధికారులకు కంప్లెట్ చేస్తానని దీనిపై నాకు లిఖితపూర్వకంగా నాకు వివరణ కావాలని మున్సిపల్ కమీషనర్‌ను వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కోరారు.

### కాపా మురళీకృష్ణ వైరా మున్సిపాలిటీ ప్రజాప్రతినిధినా?



# జల్ సంచయ్ జన భాగిదారి(జెఎస్‌జెబి) 3.0 కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికి తెలియజేయునది ఏమనగా, భారత ప్రభుత్వం జల శక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన భాగిదారి(జెఎస్‌బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా పాల్గొనాలని మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు,, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని వర్షపు నీటి సంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటి వృధాను నివారించాలని, భూగర్భ జలాలను పెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రత ఇంట్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైంది. ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు, పర్యావరణ పరిరక్షణకు మనందరం తోడ్పడవచ్చు. నీటి ప్రతి బొట్టు అమూల్యమైంది. భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించాలంటే ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటి సంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా పాల్గొని సజల్ సంచయ్ జన భాగిదారి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేయడమైంది. ఈ ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి వైరా మున్సిపాలిటీతో కలిసి ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా పాల్గొని నీటి సంరక్షణకు కట్టుబడి ముందుకు రావాల్సిందిగా మున్సిపల్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

# పారిశ్రామిక ప్రాంతాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/ముదిగొండ:** జిల్లా పోలీసు కమిషనర్, రూరల్ సబ్‌డివిజన్ ఏసీపీ ఆదేశాల మేరకు బుధవారం ముదిగొండ మండలంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో పోలీసులు సీఐ మురళి నేతృత్వంలో ఆకస్మికంగా విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి గ్రానైట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలు, వారి గుర్తింపు కార్డులు తదితర సమాచారాలను సేకరించారు. అంతర్రాష్ట్ర నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం, గంజాయి, డ్రగ్స్ వంటి మాధక ద్రవ్యాల అక్రమ రవాణా వినియోగం నిరోధించడం ప్రధాన లక్ష్యంగా తనిఖీలు చేశారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన కార్మికులపై పరిశ్రమల యాజమాన్యులు నిరంతరం నిఘా ఉంచాలని, ముఖ్యంగా ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికుల నివాసాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తున్నామని, మాదకద్రవ్యాలు వినియోగం, అక్రమ రవాణా పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు సీఐ మురళి తెలిపారు. ఈ తనిఖీలల్లో ఎస్సై అశోక్, ఏఎస్సై ఖాలిక్, హెడ్ కానిస్టేబుల్ మదార్‌సాహెబ్, పీసీలు శ్రీను, సాయిలు తదితరులు ఉన్నారు.

# సిపిఐ సానుభూతిపరురాలు లింగ నాగరత్నమ్మ మృతి

### -నివాళులర్పించిన బాగం, మౌలానా



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలానికి చెందిన దివంగత సిపిఐ సీనియర్ నాయకుడు లింగ రామయ్య సతీమణి, పార్టీ సానుభూతిపరురాలు లింగ నాగ రత్నమ్మ బుధవారం తన నివాసంలో కన్ను మూశా రు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యు డు భాగం హేమంత్‌రావు మృతురాలి నివాసానికి చేరుకుని ఆమె భౌతికకాయంపై అరుణ పతాకం కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించా రు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లింగ నాగరత్నమ్మ మృతి పార్టీకి,కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. మృతురాలికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, పాలేరు నియోజకవర్గ నాయకుడు లింగా వెంకటనారాయణ, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ నాయకులు చుండూరు కృష్ణ, పట్టాభి తదితరులు పాల్గొని మృతురాలకి నివాళుర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రఘుపతి రెడ్డికి ఘన నివాళి



**ప్రజాపక్షం/తల్లాడ :** మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసి రఘుపతిరెడ్డికి సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాఘమయి, మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర నాయకుడు దయానంద్ బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు ఆయన పార్థీవ దేహానికి కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో తల్లాడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, నాయకులు కాప సుధాకర్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, తుమ్మలపల్లి రమేశ్, జిల్లా నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, ఏఎమ్‌సీ చైర్మన్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయాల కట్టడికి విస్తృత తనిఖీలు




**ప్రజాపక్షం/వైరా :** మత్తు మాఫియా కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాలు, ఆన్‌లైన్ చాక్లెట్లు, సిగరెట్లలో గంజాయి కలిపి రహస్యంగా అమ్ముతున్న నేపథ్యంలో బుధవారం వైరాలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకొని వివిధ ప్రాంతాల్లో గంజాయిని చాక్లెట్లు, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు వైరా పరిసర ప్రాంతాల్లో స్కూల్స్, కాలేజీలు, దుకాణాల్లో గంజాయి విక్రయాలను అణచివేయడానికి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైరాలో గంజాయి హాట్‌స్పాటల్‌లపై ప్రత్యేక దృష్టి సారించి పాన్ షాపులు, కిరాణా దుకాణాలు ముసుగులో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పోలీసులు పసిగట్టి కఠినచర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ అక్రమ వ్యాపారంలో పట్టుబడిన వారికి పిడి యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తున్నామని అన్నారు.

# ఆశా వర్కర్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని రఘునాధ గూడెం గ్రామానికి చెందిన జానపాటి శారద (47) తోటి కోడళ్ళ మధ్య చిన్న వివాదంతో దుర్భాషలాడుకుంటూ ఉండడంతో మనస్పర్థలు రావడం వలన మందు గోలీలు మింగి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. ఆమెకు భర్త, ఒక కూతురు ఉంది. ఈ విషయమై కూతురు అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు. భౌతిక దేహాన్ని కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేసినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఆశ వర్కర్లు ఆమె అకాల మృతికి సంతాపాన్ని సానుభూతిని తెలుపుతూ నివాళులర్పించారు.

# ఎల్నినో ప్రభావంతో వరి సాగు విస్తీర్ణం తగ్గించాలి



**ప్రజాపక్షం/ముదిగొండ:** ఎల్నినో ప్రభావంతో వరి సాగు విస్తీర్ణం తగ్గించి, ఆరుతడి పంటలైన మినుము, కంది, పెసర, అపరాలు, మిల్లెట్స్ వంటి పంటలను సాగు చేయాలని ఏఈఓ మౌనిక సూచించారు. మండల పరిధిలోని కమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రైతులతో ఏర్పాటైన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఎల్నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యాన్మాయ సాగువిధానాలపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం కింద నీటి కుంటలు 100శాతం సబ్సిడీతో మంజూరు అవుతాయని, ఐదు ఎకరాల లోపు భూమి కలిగి, ఉపాధి హామీ జాబుకార్డు ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం సర్పంచి అంజయ్య, ఉప సర్పంచి, ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీ నరసింహ, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ఎన్‌ఓసీ వివాదం

## డబ్బులు ఇస్తే చాలా.. ఏ కాగితమైనా వస్తుందా..?

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీలో అధికారుల పనితీరుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బులు చెల్లిస్తే నిబంధనలను పక్కనపెట్టి ఏ పని అయినా పూర్తి చేస్తున్నారనే ఆరోపణలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. పట్టణంలోని రాజీవ్ కాలనీలోని ప్లాట్ నంబర్342కు సంబంధించిన వ్యవహారం దీనికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులసమాచారం మేరకు ప్లాట్ నంబర్342కు బుద్ధా జయమ్మ పేరుతో పట్టా ఉండగా, ఆస్తిపై యాజమాన్య వివాదం కొనసాగుతున్నప్పటికీ ఒక వ్యక్తి మున్సిపాలిటీలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ దరఖాస్తుపై సరైన పరిశీలన లేకుండానే విద్యుత్ మీటర్ మంజూరుకు అవసరమైన ఎన్‌ఓసీ జారీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అంతేకాకుండా, మున్సిపాలిటీ జారీ చేసిన ఎన్‌ఓసీ పత్రంలో అనేక స్పెల్లింగ్ తప్పులు, వివరాల లోపాలు ఉన్నాయని, అధికారిక పత్రానికి ఉండాల్సిన ప్రమాణాలు పాటించలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి పత్రాన్ని ఆధారంగా చేసుకుని జీవో నంబర్58 కింద రిజిస్ట్రేషన్ కూడా జరిగినట్లు సమాచారం. మరోవైపు, సంబంధిత ఇంటికి ఇప్పటివరకు హౌస్ ట్యాక్స్ లేదా నీటి పన్ను చెల్లించిన రికార్డులు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. పన్నులు వసూలు చేయాల్సిన మున్సిపల్ సిబ్బంది ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు ఒకరికి, మినహాయింపులు మరొకరికి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ఎన్‌ఓసీ ఏ ఆధారాలతో జారీ చేశారు...?. సంబంధిత అధికారుల పాత్ర ఏమిటి...?. పన్నులు చెల్లించకుండా ఎలా అనుమతులు పొందారు..? అనే అంశాలపై జిల్లా స్థాయి అధికారులు దర్యాప్తు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


OFFICE OF THE MUNICIPAL COUNCIL - SATHUPALLI
From
Municipal Commissioner,
Sathupalli
To
The O/o TSNPDCL,
Sathupalli.
NO OBJECTION CERTIFICATE

# సర్ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షపాతంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీజ తో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా బిఎల్‌వోలు జులై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జులై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ ఒకటిన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1460 పోలింగ్ స్టేషన్లు, 1243781 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 848491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేశామని 68.22 శాతం నమోదైందన్నారు. ఇంకా 395290 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. డిజిటలైజేషన్ వివరాల్లో 72వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామన్నారు. సుమారు 25వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే సమర్పించి అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవపత్రాలు సమర్పిస్తే పరిశీలించి అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేరుస్తామన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. నోటీసులకు స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల ధృవపత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామన్నారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలంటే ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డిసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, అధికారులు , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని వల్లభి గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి సంభవించిన అగ్నిప్రమాదంలో యేసు శంకర్‌బాబు ఇళ్లు పూర్తిగా దగ్ధమై బట్టలు, వంటసామాగ్రి, టీవీ, ఆహారపదార్థాలు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబానికి భారీ నష్టం కలగడంతో వల్లభి భక్త రామదాసు స్వచ్ఛంధ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.25వేలు నగదు సాయం చేశారు. ఆర్థిక సాయం సమితి ఛైర్మన్ పోట్ల వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో అండగా నిలిచారు. ఈ మేరకు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న స్వచ్ఛంధ సంస్థను ప్రజలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ధనమూర్తి, బిచ్చాల కొండా విజయభాస్కర్, ఏనుగుల బాబూరావు, ఏనుగుల రమేశ్, ఏనుగుల వెంకటేశ్వర్లు, గురవయ్య, జెట్టి కృష్ణ, నాగారపు పిచ్చయ్య, బెల్లంకొండ వెంకన్న, బెల్లంకొండ వీరస్వామి, అల్లిక గోపాలరావు, కానుగు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే గిరిజన హక్కుల సాధన

### -తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి






**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పోరాటాలతోనే గిరిజన హక్కులను సాధించుకోవచ్చని తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు సోంది కుటుంబరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఆళ్లపల్లి మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ఎల్లమ్మగుడి ప్రాంగణంలో అరెం రామకృష్ణ అధ్యక్షతన తెలంగాణ గిరిజన సమైక్య మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గిరిజనుల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలు వెంటనే మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈనెల 18,19 తేదీల్లో పాల్వంచలో నిర్వహించే తెలంగాణ గిరిజన సమైక్య మూడో రాష్ట్ర మహాసభలను గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ గిరిజన సమైక్య ఆళ్లపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కొమరం రాంబాబు, ప్రధాన కార్యదర్శి అరెం రామకృష్ణ, సహాయ కార్యదర్శి పూనెం సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు జోగా మల్లేష్, గొగ్గల బుచ్చయ్య, రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూనెం వెంకటేష్, కోశాధికారి గౌరబోయిన సీతలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొగ్గల కృష్ణ, జిల్లా నాయకులు కణితి సత్యం, వజ్జ వెంకటేశ్వర్లు, కన్నెబోయిన ప్రసాద్, గారెబోయిన నరేష్, కొమరం హనుమంతు, నరెడ్ల రాంబాబు, వజ్జ ఉమా, సర్పంచ్ కొమరం రాజేష్, ఉప సర్పంచ్ తాటి ఎల్లయ్య, పరమ ఇమ్మానియేల్, మలిపెద్ది లాజర్, వజ్జ పగడయ్య, మెస్సు శ్రీను, వార్డు సభ్యులు తాటి సంధ్య, గలిగే ప్రశాంతి, మలిపెద్ది బాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

### -ఆగస్టు మూడు వరకు ఇంటింటి సర్వే

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించిన గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పి. సుదర్శన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత షెడ్యూల్ ప్రకారం బిఎల్‌వోల ఇంటింటి సర్వే ఈనెల 24 వరకు ఉన్న గడువును ఆగస్టు మూడు వరకు పొడిగించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణను ఆగస్టు 10న విడుదల చేయనున్నారు. అభ్యంతరాలు, క్లెయిమ్ స్వీకరణ ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ తొమ్మిది వరకు స్వీకరిస్తారు. స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబరు ఎనిమిది లోగా పరిష్కరించి తుది ఓటరు జాబితాను అక్టోబరు 12న నియోజక వర్గాల వారీగా అధికారికంగా విడుదల చేయనున్నారు. ఓటర్లు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఎన్యూమరేషన్ ఫారాలను గడువు లోగా పూర్తి చేసి తమ ఓటు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలన్నారు.

## ఓటు పోతే ప్రాణం పోయినట్టే..



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ సర్ కార్యక్రమంపై అఖిలపక్ష పార్టీలు, బిఎల్‌వోలుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతే ప్రాణం పోయినట్లే అని అన్నారు. ప్రతి వార్డులో ఎక్కడ ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు అది అధికారులు బిఎల్‌వోలు బాధ్యతగా తీసుకోవాలి. ఓటు కోల్పోయింది అంటే మన ప్రాణం పోయినట్టే ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటు హక్కు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ ఛైర్మన్ కట్ల సంతోస్, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిడివో సక్రియ, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

## రైల్వే ఆస్తులు..ప్రయాణికుల భద్రతే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రైల్వే ఆస్తుల పరిరక్షణతో పాటు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. బుధవారం ఖమ్మం రైల్వే స్టేషన్ ఆవణలోని రైల్వే రక్షణ దళం పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిసిటీవి కంట్రోల్‌రూమ్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ అధికారులు, సిబ్బందితో ఆమె సురక్షా సమ్మేళన్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాలు గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్‌పిఎఫ్ పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ రైల్వే ప్రయాణికులకు సురక్షితమైన, భద్రమైన వాతవరణాన్ని కల్పించేందుకు కృషిచేయాలన్నారు. ఈ తనిఖీలలో ఆమె వెంట ఆర్‌పిఎఫ్ సికింద్రాబాద్ సినియర్ డివిజన్ కమిషనర్ ఎ. నవీన్‌కుమార్, ఖమ్మం ఆర్‌పిఎప్ సిఐ బుర్ర సురేష్‌గౌడ్, జిఆర్‌పి స్టేషన్ సిఐ శ్రీనివాస్, సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ స్టేషన్ల సిబ్బంది, రైల్వే అధికారులు ఉన్నారు.

## రైతులకు పంటలపై ఎల్‌నినో ప్రభావం అవగాహన



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య మధిర మండలంలోని వివిధ గ్రామాల్లో సందర్శించి రైతులకు పంటలపై ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. రైతులు ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్‌లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు. మండలంలో జులైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపద్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు ఫార్మ్మాండ్స్(పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం విబిజి రామ్ జి పథకం ద్వారా 100% రాయితీపై అందిస్తుందని ఈ ఫార్మ్‌పాండ్స్(పంట కుంటలు) పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్, గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

## పలు సిసి రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** స్థానిక శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టివిక్రమార్క సహకారంతో ఎన్ఆర్‌ఈజిఎస్ నిధులు ద్వారా రూ.11లక్షల సిసి రోడ్లు, తొర్లపాడులో ప్రాథమిక పాఠశాలకు ప్రహారీగోడ నిర్మాణం కొరకు రూ.10లక్షలు మంజూరు చేశారు. అట్టి పనులకు బుదవారం మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పారుపల్లి విజయ్‌కుమార్, మాజీ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, గ్రామ సర్పంచ్ షేక్ కన్నం సాహెబ్, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్‌లు పాల్గొని పూజా కార్యక్రమం చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, గ్రామశాఖ అధ్యక్షులు చేబ్రోలు కృష్ణ, సూర్యదేవర వెంకటేశ్వరరావు, నారెట్ల వెంకటరెడ్డి, వాసిరెడ్డి రవికుమార్, వాసిరెడ్డి వెంకటరావు, గ్రామ పెద్దలు నల్లమల బాబురావు, వేల్పుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ సుంకర రామారావు, వార్డు మెంబర్లు, బొబ్బిళ్ళ వీరవెంకయ్య, మేడేపల్లి భవాని, శివకృష్ణ, కాశిపోయిన అరుణ, శేషుకుమార్, పల్లపోగు కృపావరం, షేక్ బికార్‌సాహెబ్, మేడేపల్లి మాధవరావు, నల్లమల భద్రరావు, చేబ్రోలు వెంకటేష్, చేబ్రోలు రాము, పుల్లూరు సైదమ్మ, నల్లమల రామ్మోహన్‌రావు, రొయ్యల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.